క్లుప్తంగా

చంద్రశేఖర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం పరిశోధకుడు పి.చంద్రశేఖర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. యాన అప్రైజల్ ఆఫ్ కో ఆపరేటివ్స్‌విస్ ఏవిస్ రూరల్ డెవపల్‌మెంట్ ఎ స్టడీ ఇన్ సెలెక్ట్ డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణా అనే సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు చంద్రశేఖర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్ నర్సింహాచారి తెలిపారు. ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఎండీ. ఇక్బాల్ అలీ పర్యవేక్షణలో చంద్రశేఖర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

నేడు జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో వైద్యశిబిరం

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఆస్పత్రి ఆధ్వర్యంలో జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో బుధవా రం వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మంగళవా రం కాజీపేట రైల్వే ఆస్పత్రి సీనియర్ ఎం.ఎస్ డాక్టర్ ఐ.నిరంజన్‌రావు తెలిపారు. జమ్మికుంటలోని రిటైర్డ్ రైల్వే ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, ఎంప్లాయీస్‌కు హెల్త్ క్యాంప్‌లో ఈసీజీ, బీపీ, బ్లడ్ టెస్ట్ తదితర వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హసన్‌పర్తి : చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కోమటిపల్లి, భద్రకాళినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

గ్రూప్-2 ఆన్‌లైన్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్ : గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8, 9, 15, 16, 22, 23, 30, 31వ తేదీల్లో నిర్వహించనున్న టెస్ట్‌కు ఆన్‌లైన్‌లో tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో జూలై 5లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉచిత శిక్షణకు..


సివిల్ సర్వీస్–25 పోటీపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అందజేస్తున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీవీ.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జూలై 3 లోపు ఆన్‌లైన్‌లో tgbcstudycircle. cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలతకు సన్మానం



హన్మకొండ: టీజీ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలతను అద్దె బస్సుల యజమానులు మంగళవారం సన్మానించారు. శ్రీలత రంగారెడ్డి రీజియన్‌కు బదిలీ కాగా మంగళవారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, జ్ఞాపిక అందించి సన్మానించారు. ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్బ మధుకర్‌రెడ్డి, రీజినల్ అధ్యక్షుడు మారెపల్లి రాంరెడ్డి, సభ్యులు బి.లింగారెడ్డి, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

బీమా అందజేత



మామునూరు: ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురంలో శ్రీజనచైతన్య పురుషుల పొదుపు సంఘం సభ్యులు బండి కొమురయ్య, మేకల నారాయణ ఇటీవల మృతి చెందారు. బాధితుల కుటుంబాలకు మంగళవారం శ్రీజన చైతన్య పురుషుల సంఘ కార్యవర్గ ప్రతినిధులు పరామర్శించి ఒక్కొక్కరికి రూ.70వేల చొప్పున ఇద్దరికి బీమా సొమ్మును అందజేశారు. సంఘం అధ్యక్షుడు మాచర్ల రంజిత్‌కుమార్, ప్రతాపరుద్ర పురుషుల పొదుపు సమితి కొండపర్తి అధ్యక్షుడు మందల సుదర్శన్‌రెడ్డి, బండి శ్యామ్, బోగవల్లి మధుకర్‌రావు, మేకల సూరయ్య, ముల్కలపల్లి విజేందర్, మాచర్ల శ్రీనివాస్, ఇల్లందల వెంకటస్వామి, లక్క రమేష్, కాయిత యాకయ్య, ఇల్లందుల దేవేందర్, సట్ల భిక్షపతి పాల్గొన్నారు.

ఎప్పుడు కూలుతాయో!

- శిథిలావస్థలో జీపీ భవనాలు
- అద్దె భవనాలు, అరకొర వసతులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- నిధులు కేటాయించినా ప్రారంభంకాని పనులు



శిథిలావస్థకు చేరిన పులుకుర్తి గ్రామపంచాయతీ భవనం

దామెర : 'గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే గ్రామాల్లో సుపరిపాలన అందించాలి. గ్రామాల్లో అన్ని శాఖలకు సంబంధించిన కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించాలి. అప్పుడే ప్రతి గ్రామం అభివృద్ధి దిశలో పయనిస్తుంది' అనే ప్రజాప్రతినిధుల ప్రసంగాలు నీటిమూటలుగా మిగిపోతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామసచివాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అరకొర వసతులు, అద్దె భవనాల్లో పరిపాలనను నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే స్థితికి చేరుకుంది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామంలోని ఒక భవనాన్ని అద్దెకు తీసుకొని పరిపాలన కొనసాగిస్తున్నారు. పంచాయతీ భవన నిర్మాణం కోసం గతంలోనే అప్పటి ఎమ్మెల్యే ధర్మారెడ్డి శంకుస్థాపన చేసి నిధులు మంజూరు చేశారు. శంకుస్థాపన చేసి ఏళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదు. భవనం నిర్మించే స్థలం విషయంలో ప్రజాప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభించలేదని చర్చ జరుగుతోంది. త్వరలో పనుల ప్రారంభించి అన్ని వసతులతో కూడిన కార్యాలయాన్ని నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు. అలాగే ముస్త్యాలపల్లి గ్రామంలోని జీపీ భవనం శిథిలావస్థకు చేరడంతో దీనిని తొలగించారు. నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించినా స్థలం విషయంలో కొంత భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో పనులు ఇంత వరకు ప్రారంభించలేదు. కాగా గ్రామంలోని వాటర్ ప్లాంట్ భవనం నుంచి పరిపాలన కొనసాగిస్తున్నారు. అదే విధంగా పసరగొండ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం పైకప్పు పెచ్చు లు ఊడటంతో పాటు వర్షం వస్తే భవనంలోకి నీరు చేరి ముఖ్యమైన పత్రాలు, రిజిష్టర్లు తడిసి ముద్దవుతున్నాయని సిబ్బంది మొర పెట్టుకుంటున్నారు. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది విధులు నిర్వహించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. పులుకుర్తిలోని గ్రామ పంచాయతీ భవనం కొన్ని సంవత్సరాల క్రితం పెంకులతో ఏర్పాటు చేసింది కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామపంచాయతీకి వచ్చిన ఫిర్యాదుదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి గ్రామపంచాయతీల్లో మౌలిక వతసులతో కూడిన పక్కా భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఉన్నతాధికారుల, పాలకులు దృష్టి సారించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.



ముస్త్యాలపల్లి వాటర్ ప్లాంట్‌లో సమావేశం నిర్వహిస్తున్న పాలకమండలి (ఫైల్)



శిథిలావస్థలో దామెర గ్రామపంచాయతీ భవనం

అనువైన స్థలంలో నిర్మించాలి



మండల కేంద్రంలో సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఏళ్లు గడుస్తున్నా నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి అధికారులు చొరవచూపడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏకాభిప్రాయానికి వచ్చి ప్రజలందరికీ అనువైన స్థలంలో గ్రామపంచాయతీ భవనం నిర్మించి ప్రజలకు సుపరిపాలన అందించాలి. అధికారులు, పాలకులు దృష్టి సారించాలి.

- సోనబోయిన రాజు, దామెర

ఆలయంలో సుదర్శన నారసింహ కల్యాణం



మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని మూలవరులకు, ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, సుదర్శన నారసింహ హవనం, కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వయంభూ స్తంభ నారసింహుడు, గర్భాలయంలో ప్రతిష్ఠించిన లక్ష్మీనారసింహుడి ధృవమూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచసూక్తాలు పఠిస్తు పంచామృతాలతో అభిషేకించారు. సుదర్శన శతకం అనుసంధానిస్తు పాంచరాత్రాగమం ప్రకారం సుదర్శన నారసింహ హవనం నిర్వహించి పూర్ణాహుతి గావించారు. లక్ష్మీనారసింహుడు, పద్మావతి, మంగతో వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణం కనులపండువగా నిర్వహించారు. నక్షత్ర హారతి సమర్పణ చేసి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. హాజరైన భక్తులకు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ-రాణి దంపతులు, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఇన్స్‌పెక్టర్ సంజీవరెడ్డి, సూపరింటెంట్ కిరణ్, డైరెక్టర్ తాడెం మోహన్, అచార్యులు వెంకటరత్నం, జయకృష్ణ, లోకేష్, భక్తులు వేముల పూర్ణచందర్-వినీల, గుండపు వెంకట్రాంనర్సయ్య-సుభద్ర, అలువాల సుదర్శనం-సరస్వతి, రావుల రవికుమార్, గుండపు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటసాగు పరిశీలన

సాక్షి స్పందన



మొలక శాతాన్ని పరీక్షిస్తున్న కవిత

ఐనవోలు : ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన బండారి శ్రీను మొక్కజొన్న సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని ఏఓ అడప కవిత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల బండారి శ్రీను తన చెలుకలో మొక్కజొన్న విత్తగా మొలకలు సరిగా రాలేదని ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కాగా ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితం అయ్యింది. దీంతో ఏఓ కవిత మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సదరు రైతు సాగుచేసిన రకం విత్తనాలే మరి కొంతమంది రైతులు విత్తారని తెలుసుకుని వారి పొలాలను కూడా పరిశీలించినట్లు ఆమె తెలిపారు. విత్తన మొలకశాతం పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు చెప్పారు. ల్యాబ్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బావుల చుట్టూ ప్రహరీ నిర్మించుకోవాలి

- కాజీపేట ఏసీపీ తిరుమల్
- ప్రమాదకర బావుల పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న ఏసీపీ తిరుమల్

హసన్‌పర్తి: రోడ్డుకిరువైపులా ప్రమాదరకంగా ఉన్న బావుల చుట్టూ ప్రహరీ నిర్మించుకోవాలని కాజీపేట ఏసీపీ తిరుమల్ సూచించారు. హసన్‌పర్తి మండలంలోని గంటూరుపల్లి పాఠశాల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావిని ఆయన పరిశీలించారు. వాహనచోదకులు అదుపుతప్పి బావిలో పడి ఆస్పత్రిలో చేరారని స్థానికులు ఏసీపీకి వివరించారు. బావిని పూడ్చాలని ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. రెండేళ్లుగా ఈ సమస్య ఇలాగే ఉందని తెలిపారు. అనంతరం ఏసీపీ తిరుమల్ మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావులను గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టాదారులతోనే బావిచుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయించాలని సూచించారు. ఒక వేళ అవసరం ఉంటే ఆ బావిని పూడ్చాలని ఆదేశించారు. పట్టాదారుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బావి వద్ద ఏదైనా ప్రమాదం జరిగితే పట్టాదారుడిని బాధ్యుడిగా చేస్తామన్నారు. అతడిపై కేసు నమోదు చేస్తానని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఏసీపీ వెంట పోలీస్ ఇన్‌స్పెక్టర్ జవ్వాజీ సురేష్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేటి నుంచి దర్గా రైల్వే గేట్ మూసివేత



కాజీపేట రూరల్ : కాజీపేట-వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న దర్గా రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ నంబర్ 60ను వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు మంగళవారం రాత్రి రైల్వే అధికారులు తెలిపారు. మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల నేపథ్యంలో దర్గా రైల్వే గేట్‌ను ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దర్గా రైల్వే గేట్‌లో నుంచి వివిధ మార్గాలకు ప్రయాణించే ప్రజలు, వాహనదారులు ఆయా తేదీల్లో వేరే మార్గం గుండా రాకపోకలు సాగించి రైల్వే అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

టెస్కాబ్ చైర్మన్‌కు అభినందన



ఐనవోలు : టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావును మంగళవారం ఆయన నివాసంలో జెడ్పీ వైస్‌చైర్మన్ గజ్జెల శ్రీరాములు, వర్ధన్నపేట జెడ్పీటీసీ మార్గం భిక్షపతి మర్యాద పూర్వకంగా కలిశారు. రవీందర్‌రావుకు మొక్కను అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయి పదవికి వన్నె తేవాలని ఆకాంక్షిస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దామెర : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బిల్లా రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వరుణుడు కరుణించాలని ప్రత్యేక పూజలు

- దామేశ్వరాలయంలో అభిషేకాలు

దామెర : వరుణుడు కరుణించాలని కోరుతూ మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, గ్రామస్తులు బిందెలతో నీళ్లు పోసి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అదే విధంగా ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల రాజు శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ బిల్లా రమణారెడ్డి మాట్లాడుతూ.. సమృద్ధిగా వర్షాలు కురిసి అన్నదాత కళ్లల్లో ఆనందం కనిపించాలని వేడుకున్నట్లు తెలిపారు. పాడి పంటలు పండాలని, ప్రతి ఇంటా సిరులు పండాలని వర్షాలు సకాలంలో కురవాలని, వరుణుడి రాకకోసం ఎదురుచూస్తున్నారని, కరుణించు దేవా అంటూ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పోల్సాని అనిల్‌రెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, దుర్శెట్టి భిక్షపతి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉన్మాదికి ఉరిశిక్ష విధించాలి

ఖిలా వరంగల్ : ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన ఉన్మాదికి వెంటనే ఉరిశిక్ష విధించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. మంగళవారం నగరంలోని 39వ డివిజన్ సాకరాశికుంట మహారాజ్ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో హనుమకొండ రెడ్డికాలనీలో 9నెలల పసిగుడ్డుపై అత్యాచారం, హత్య చేశారని గుర్తు చేశారు. ఇటుక బట్టీలో బాలికపై ఇదే రకమైన దాడి చేశారని, తాజాగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా, లక్ష్మీ తండాలో కిరాణానికి వెళ్లిన 12 ఏళ్ల బాలిక మాయమై చెత్తకుండిలో శవమై కనిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడిని పోక్సో చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలెపాక మార్టిన్ లూథర్, జనార్దన్, వీరస్వామి, సుదర్శన్, నవీన్, వీరస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహిళా సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడిలో చదువుకున్న వారు రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులు అయ్యారని గుర్తుచేశారు. గ్రూప్స్, సివిల్స్, పోస్టల్, రైల్వే పోటీ పరీక్షల్లో 70 శాతం ప్రభుత్వ బడుల్లో చదివిన వారే ఎంపికవుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో బట్టి, మార్కుల పద్ధతి ఉంటుందన్నారు. విద్యార్థి ఆలోచన శక్తిని పెంపొందించే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరుగుతుందని వివరించారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న ఉదంతాలు చూస్తున్నామని, తల్లిదండ్రులు ఆలోచించాలన్నారు. ఒత్తిడిని తట్టుకుని నిలబడేలా బోధించే ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీహర్షుడు, సత్యనారాయణ, మధుకర్, బీమల్ల సారయ్య, మహేందర్‌రెడ్డి, సరళాదేవి, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు సమ్మక్క, రాజేశ్వరి, పద్మ, యశోద, రేణుక, దీపిక, ఏఏపీసీ చైర్మన్ నల్లబెట్ట అనిత, శైలజ, సునీత, మాదవి, నర్సయ్య, రాజిరెడ్డి, నాగేశ్వర్‌రావు, రాము, సతీష్‌కుమార్, విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి



ఎంపీడీఓ ఫణిచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

శాయంపేట : మండల కేంద్రంలోని పోచమ్మగుడి స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వంగరి సాంబయ్య, వినుకొండ రాజ్‌కుమార్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎంపీఓ రంజిత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. పోచమ్మగుడి స్థలాన్ని రెండు నెలల క్రితం ఆక్రమించి అక్రమ నిర్మాణం చేస్తున్నారని, పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో ప్రశ్నించినా వారిలో మార్పు రాలేదని తెలిపారు. అక్రమ నిర్మాణం కూల్చివేయాలని అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. గుడి స్థలాన్ని వదిలిపెట్టి నిర్మాణాన్ని కొనసాగించాలని తెలిపారు. గ్రామపంచాయతీ నుంచి ఇంటి పర్మిషన్ లేకుండా నిర్మాణం చేపడుతున్నారని, వారిపై చర్య తీసుకోవాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాసాని వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, రాజు, సదాశివుడు, ఆడెపు అశోక్ పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



స్టేషనరీని అందజేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

ఐనవోలు : పేద విద్యార్థుల చదువుకు సహకరిస్తున్న దాతల సహకారం మరువలేనిదని కక్కిరాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆర్ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం పాఠశాలలో దాతలు అందించిన నోట్ బుక్స్, ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, షార్ప్‌నర్, ఎరేజర్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. అడగగానే దాతలు మెట్టు తిరుపతిరెడ్డి, ఆత్మకూరు శ్రీనివాస్, శనిగరం సాంబయ్య, బొలుగొడ్డు శ్రీధర్ ముందుకొచ్చి సుమారు రూ. 25వేల విలువచేసే స్టేషనరీని అందించినట్లు తెలిపారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ సత్యనారాయణ, ఏఏపీసీ చైర్మన్ స్వర్ణలత, హైస్కూల్ హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు మహమ్మద్, యూసుఫ్ పాషా, పద్మలత, సురేఖ, అంగన్‌వాడీలు వకుళాదేవి, హైమావతి, శ్రీలేఖ పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగా శిక్షణ ఇస్తున్న కొలుగూరి రాజేశ్వర్‌రావు

పరకాల : యోగా ద్వారా రోగాల బారి నుంచి కాపాడుకోవడంతో పాటు ఆరోగ్యంగా జీవించవచ్చని పతంజలి యోగ పరకాల కేంద్రం నిర్వాహకుడు, యోగ గురువు కొలుగూరి రాజేశ్వర్‌రావు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 16 రోజులుగా ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిఒక్కరూ ఉచిత యోగా తరగతులను వినియోగించుకోవాలని కోరారు. యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు మెదడు చురుకుగా పనిచేస్తుందని, యోగాను అలవర్చుకోవాలని అన్నారు. అదే విధంగా ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న యోగాడేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జీపీ రికార్డుల్లో అవకతవకలు ఉండొద్దు

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు

దామెర : గ్రామపంచాయతీ కార్యాలయల్లోని 7 రికార్డులను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలు ఉండొద్దని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జులై మొదటి వారంలో కేంద్ర ప్రభుత్వ బృందాలు మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని రికార్డులను అప్‌డేట్ చేసి సిద్ధంగా ఉంచాలని అన్నారు. హరిత హారంలో నాటిన మొక్కలు కొన్ని ఎండిపోయాయని వాటి స్థానంలో మళ్లీ మొక్కలను నాటాలని అన్నారు. వచ్చే నెలలో నిర్వహించనున్న సోషల్ ఆడిట్ కోసం రికార్డులు సిద్ధం చేయాలని కోరారు. ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ నర్సింహరావు, డీటీసీ శ్రీధర్, ఏపీఓ శారద, కార్యదర్శులు, పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో సైన్స్‌గ్రూపు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సవడ్ల సదానందం కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాశాలలో సైన్స్ గ్రూపులు లేకపోవడం వలన స్థానిక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా సైన్స్ గ్రూపులు ప్రారంభించాలన్నారు. స్థానిక జూనియర్ కాలేజీలో సైన్స్ గ్రూపు లేకపోవడంతో విద్యార్థులు ఇతర ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. అధికారుల స్పందించాలని కోరారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా అవార్డు అందుకున్న వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ప్రతినిధి దేశిని లక్ష్మీనారాయణను మంగళవారం ఘనంగా సన్మానించారు. సీఆర్‌పీఎఫ్-58 బెటాలియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ కమాండెంట్లు సుమ పాల్గొన్నారు.